
ప్రజాశక్తి
బుధవారం 16 జులై 2025
5
పార్వతీపురం మన్యం



అగని డోలీమోతలు

మార్గమధ్యంలో ప్రసవించిన గర్భిణీ

సాలూరు: నియోజకవర్గంలోని గిరిశిఖర గ్రామాల నుంచి డోలీమోతలు ఆగడంలేదు. గడచిన నెలరోజుల్లో నియోజకవర్గంలో రెండు డోలీమోతలు ఎదురయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాకాలో డోలీమోతలు తరచూ కనిపిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. కొదమ పంచాయతీలో కంజుపాకు చెందిన కొండతామర సుందరిని బంధువులు డోలీలో మక్కువ పిహెచ్‌సికి తీసుకొచ్చి అక్కడి నుంచి ఆటోలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా సుందరి మార్గమధ్యలో ప్రసవించింది. దీంతో తల్లీబిడ్డలకు ఏరియా ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసిన తర్వాత విజయనగరంలోని ఘోషా ఆసుపత్రికి రిఫర్ చేశారు. సుందరికి రెండో కాన్పు ప్రసవ సమయం కావడంతో నొప్పులు పెరిగాయి. దీంతో బంధువులు గాబరాపడి డోలీలో తీసుకొచ్చారు.

జిఒ 3కు ప్రత్యామ్నాయంపై అడుగులు

- ఎస్‌టి సంఘాల అభిప్రాయం తీసుకొనే పనిలో సర్కారు
- గిరి మిత్ర హాలులో సంఘాలతో ఐటిడిఎ పిఒ భేటీ
- వందశాతం రిజర్వేషన్‌కే నాయకులు మొగ్గు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలన్న జిఒ 3కు ప్రత్యామ్నాయంపై ప్రభుత్వం తొలి అడుగు వేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన తర్వాత గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా చర్యలు చేపట్టింది. అయితే జీవో 3నే పునరుద్ధరణ చేస్తామని టిడిపి నేతలు స్పష్టమైన హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం మాట మార్చే ప్రయత్నం చేస్తోంది. ఈ 3పై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ దీనికి ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవో విధివిధానాలు ఎలా ఉండాలనే దానిపై రాష్ట్రంలోని గిరిజన సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. దీని కోసం అన్ని ఐటిడిఎల పరిధిలో ఉన్న గిరిజన సంఘాల నాయకులను ఆహ్వానించి అభిప్రాయం తీసుకోవాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్‌శ్రీ వాత్సవ్ మంగళవారం స్థానిక గిరి మిత్ర హాలులో గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం దేశంలో రిజర్వేషన్లు 50శాతం మించరాదన్న నిబంధనకు లోబడి గిరిజనులకు 49శాతం రిజర్వేషన్ అమలు చేస్తే సమ్మతమా కాదా అన్న ప్రశ్నను పిఒ గిరిజన సంఘాల నాయకుల ముందు ఉంచారు. దీన్ని గిరిజన సంఘాల నాయకులు ముక్తకంఠంతో



గిరిజన సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

వ్యతిరేకించారు. 49 శాతం రిజర్వేషన్లతో ప్రత్యామ్నాయ జిఒకు తాము వ్యతిరేకమని వారు స్పష్టం చేశారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 244(2) ప్రకారం ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు వందశాతం రిజర్వేషన్ అమలు చేయొచ్చునని వాదించారు. సమావేశంలో ఆదివాసీ జెఎసి నాయకులు నిమ్మక జయరాజ్, ఆరిక చంద్రశేఖర్, తాడంగి సాయిబాబు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గిరిజన నాయకులు మణి కుమార్, గేదెల రామకృష్ణ పాల్గొన్నారు.

కాలయాపన కోసమేనన్న అనుమానాలు

జిఒ నెంబర్ 3 పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిన టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయ జిఒపై చర్చలు ప్రారంభించడం వెనుక కాలయాపన కోసమేనని స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్ ఏరియాలో చేర్చాల్సిన గ్రామాలను ప్రకటించాలి. ఈ ప్రతిపాదన అనేక ఏళ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. గత ఎన్నికల ముందు ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేపట్టిన టిడిపి నాయకులు ఊరూరా తిరిగి షెడ్యూల్ గ్రామాల ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా నియోజకవర్గంలో పర్యటించి గిరిజనులకు ఎన్నో హామీలిచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్ గ్రామాలతో పాటు మరికొన్ని గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాల జాబితాలో చేర్చాలని గిరిజన సంఘాలు ఎప్పటి నుంచో పోరాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సాలూరు మండలం జగ్గుదొరవలసలో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యాన షెడ్యూల్ గ్రామాల కోసం సుదీర్ఘ రిలే దీక్షలు చేపట్టారు. దాదాపు 8నెలల పాటు షెడ్యూల్ గ్రామాల ప్రకటన కోసం గిరిజన సంఘాలు నిరాహార దీక్షలు చేపట్టాయి. ఈ దీక్షలకు మద్దతుగా అప్పటి ప్రతిపక్ష నాయకులు, మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ నిలిచారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే షెడ్యూల్ గ్రామాల ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారు. షెడ్యూల్ గ్రామాలపై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం జీవో 3కు ప్రత్యామ్నాయంపై కసరత్తు మొదలు పెట్టింది.

17న గిరిజన సంక్షేమ డైరెక్టర్ తో భేటీ

జిఒ 3కు ప్రత్యామ్నాయంపై కసరత్తు ప్రారంభించిన ప్రభుత్వం గిరిజన సంఘాల అభిప్రాయం తీసుకునేందుకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా మంగళవారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్ గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. గురువారం గిరిజన సంక్షేమ డైరెక్టర్ సదా భార్గవి ఇదే విషయంపై జిల్లాకు వస్తున్నారు. ఆ రోజు కూడా గిరిజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు.

5985 సిసిఆర్ కార్డులు జారీ

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో 11 వేల సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 5,985 కార్డులను జారీ చేశామని కలెక్టర ఎం.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కాశీపేట రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. అలాగే "పొలం పిలు స్తోంది" కార్యక్రమాన్ని, వరి నర్సరీని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కుల కార్డులను, ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులకు భూములపై ఎటువంటి హక్కులు బదిలీ కావని స్పష్టం చేశారు. ఈ కార్డులు పంట రుణం లేదా ప్రభుత్వం పంటపై ఇచ్చే ఇతర ప్రయోజనాలను పొందేందుకు మాత్రమే దోహదపడతాయని ఆయన అన్నారు. రైతులు యూరియాను అధిక మొత్తంలో వాడరాదని ఇది పంటకు హాని కలిగిస్తుందని చెప్పారు. జిల్లాలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇందు కోసం అనవసరపు ఆందోళన అవసరం లేదని రైతులకు విజ్ఞప్తి చేశారు. జూలై నెలాఖరుకు జిల్లాలో దాదాపు 11,327 టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 10,084 టన్నులు అందాయని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,972 టన్నుల యూరియా వినియోగించగా, మిగిలినది ఆర్ఎస్‌కెలు, సొసైటీల్లో అందుబాటులో ఉందని, కొద్ది రోజుల్లో 2 వేల టన్నులు అందుతుందని తెలిపారు. మిగతా ఎరువులు - డిఎపి, పొటాష్, సూపర్ ఫాస్ఫేట్, కాంప్లెక్స్



రైతులకు ఎరువులు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎరువులు సమృద్ధిగా జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఇప్పటి వరకు 180 రైతు సేవా కేంద్రాల ద్వారా 5,165 టన్నులు, 22 సొసైటీల ద్వారా 850 టన్నుల యూరియా, డిఎపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లాకు ఆర్ఎఫ్‌సిఎల్ కంపెనీకి చెందిన 800 టన్నుల యూరియా వచ్చిందని, పంటల సాగు నమోదైన మండలాలకు ప్రాధ్యాన్యతా క్రమంలో యూరియాను కేటాయించామని, ప్రైవేట్ డీలర్ల వద్ద 1,215 టన్నులు, సొసైటీలు, రైతు సేవ కేంద్రాల వద్ద 1,350 టన్నుల యూరియా, మార్క్ఫెడ్ వద్ద 450 టన్నుల బఫర్ యూరియా నిల్వలు ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాబోయే వారం రోజుల్లో కోరమాండల్, ఐపిల్ కంపెనీల యూరియా - దాదాపు 2వేల టన్నులు కూడా జిల్లాకు సరఫరా కానుందని చెప్పారు. ఎరువులకు సంబంధించి ఏవైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం అవసరమైతే జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు (7989434766) కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు, కె.రాబర్ట్‌పాల్, మండల ఎఒ అవినాష్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

మత్తుకు యువత బానిసకావొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

మత్తుకు యువత బానిస కావొద్దని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నివారణ, మహిళల భద్రత ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం తదితర మత్తుపదార్థాలకు అలవాటు చేసుకోని విద్యార్థుల జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. దీనివల్ల బంగారు భవిష్యత్తు కోల్పోతారన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యానికి కూడా గురవుతారన్నారు. అదేవిధంగా ప్రేమల పేరుతో తప్పుడు దారిలోకి వెళ్లొద్దన్నారు. మహిళలకు ఇబ్బంది కలిగిస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయని ఆ విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని అన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటువంటి కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా విద్యార్థులపై ఉందన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన సందేశాలు పంపి ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జయమణి, అధ్యాపకులు రాజు తదితరులు ఉన్నారు.

నేడు తోటపల్లి సాగునీరు విడుదల

వీరఘట్టం : సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు ఈనెల 16 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు స్థానిక ఇరిగేషన్ ఎఇఇ డి.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ పొదిలాపు విజయ రమణి-కృష్ణమూర్తి నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు: కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పారిశుధ్య కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించి, తద్వారా వ్యాధులకు కారణమైతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం నుంచి ఈనెల 30 వరకు ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవ కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పారిశుధ్య పక్షోత్సవాలు, వెక్టర్ హైజీన్ యాప్, పీ 4 సర్వే తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మలేరియా, ఇతర జ్వరాలు ఉండే ప్రాంతాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. అలాగే నీటి నమూనాలను సేకరించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని అన్నారు. ప్రతి రోజు, పక్షం రోజులకు, మూడు మాసాలకు ఒకసారి చేపట్టాల్సి పనులు ఉంటాయని, వాటిని సంబంధిత యాప్‌లో నందు నమోదు చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులతో కార్యక్రమ పోస్టరును విడుదల చేయించాలని, వీలైతే వారిని భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రతీ మండలంలో పారిశుధ్య కార్యక్రమంలో ఉత్తమమైన మూడు పంచాయతీలను ఎంపిక చేసి ఆగస్టు 15న అవార్డులను ప్రకటిస్తామని తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కలెక్టర్ ఆదేశించారు. వర్మికంపోస్ట్ తయారుకావాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, మండల వైద్యాధికారులు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని పిహెచ్‌సిలను సందర్శించి, మలేరియా కేసులు లేకుండా చూడాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెక్టర్ హైజీన్ యాప్ ఖచ్చితంగా వినియోగించాలని స్పష్టం చేశారు. పారిశుధ్యం, మలేరియా నివారణ చర్యలు, అనీమియా యాక్షన్ కమిటీలు తదితర అంశాలను ప్రజలకు వివరించాలని అన్నారు.

పీ4 సర్వేలోని అభ్యంతరాలను స్వీకరించి త్వరగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామసభల షెడ్యూల్ వేసుకొని, ఆ విధంగా చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో పిఎం జన్ మాన్ కింద చేపడుతున్న గృహాలు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. సీతంపేట, భామిని, కురుపాం మండలాలు మరింత పురోగతి కనబర్చాలన్నారు. సమావేశంలో డిపిఒ టి.కొండలరావు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌కు డిఐఒగా అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆయనకు అందజేశారు. ప్రస్తుతం డాక్టర్ జగన్మోహనరావు ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారిగా కొనసాగుతున్నారు. గత నెల డిఐఒ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఆ పోస్ట్ ఖాళీగా ఉన్నందున గతంలో డిఐఒ ఇన్‌ఛార్జిగా జిల్లాలో టీకా కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించిన అనుభవం ఉన్న డాక్టర్ జగన్మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ఆయన జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఇంచార్జిగా కూడా జిల్లాలో పనిచేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ ఆయనకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరిండెంటెంట్ కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఖతర్‌లో వెల్డర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురం టౌన్ : ఖతార్ దేశంలోని వెల్డర్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెల్డర్స్ ఉద్యోగానికి దరఖాస్తు చేసే అభ్యర్థులకు 24 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగేళ్ల అనుభవజ్ఞులై ఉండాలన్నారు. ఎంపికైనవారికి రూ.52 వేల నుంచి రూ 61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనాలు ఇస్తారన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్ల ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా , స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవ టానికి టిక్కెట్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాస్పోర్టులు, అనుభవం సంబంధిత విద్యా ధృవ పత్రాలతో జూలై 31 లోగాhttps://naipunyam.ap.gov.in/user-registration?pageRprogram-registration దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్న వివరాలకు ఫోన్ నంబర్లు : 9676965949, 9988853335, ను సంప్రదించాలన్నారు.



వైద్యసేవలపై రోగిని అడిగి తెలుసుకుంటున్న ఎంపి తనూజారాణి

అంబులెన్స్ మంజూరుకు కృషి : ఎమ్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రికి ఎంపి నిధులతోనైనా, వేరే ఏమైనా నిధులతో అంబులెన్స్ మంజూరుకు కృషి చేస్తానని అరకు ఎంపి గుమ్మి తనూజారాణి అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని సందర్శించి, రోగులతో మాట్లాడారు. రోగులకు రొట్టె పంపిణీ చేశారు. ప్రతి వార్డు చిన్నపిల్లలు, గర్భిణీల జనరల్ వార్డు ప్రతిరోగికి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జ్వరబాధితులను కలిసి రోగాలు ఏ విధంగా వచ్చాయి, రావడానికి కారణాలపై ఆరా తీశారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు కాకుండా టిబి, కిడ్నీ, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధులు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. వీటికి కిడ్నీ వ్యాధులు రెండు గ్రామాల్లో గుర్తించినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్ త్వరలో మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూ.22 కోట్లతో ఏరియా ఆసుపత్రి మంజూరైందని, ఆ పనులు పూర్తయితే రెండు మండలాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. రోజుకు 400కు పైగా ఒపి వస్తుందంటే ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి కావాలన్నారు. అదేవిధంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపై పిఒతో చర్చించామని తెలిపారు. ఆసుపత్రిలో సిటి స్కానింగ్, ఎంఆర్ మిషన్ కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపితో పాటు మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, ఎంపిపి ఆదినారాయణ, వైస్ ఎంపిపి కె.సరస్వతి, పాలకొండ నియోజకవర్గం వైసిపి ఎస్టీ సెల్ నియోజవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచులు ఎ.కళావతి, నిమ్మక తిరుపతిరావు, బి.తిరుపతి, జెడ్‌పిటిసి ప్రతినిధి రాము, ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్, మంగయ్య ఎఎంసి మాజీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, ఆర్ఎంఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలి

- మరమ్మతు పనులు చేపట్టాలి
- ఉచితాలు కార్పొరేట్లకేనా, రైతులకు ఇవ్వరా?
- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో తోటపల్లి, పెద్దగెడ్డ, జంఝావతి, వెంగళరాయ తదితర ప్రాజెక్టుల కాలువల్లో జంగిల్ క్లియర్ చేసి, సీల్డ్ వేసి, మదుమలు తీసి, షట్టర్లు వేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ నీటి సక్రమ నిర్వహణకు ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం లస్కర్లను ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా నియమించి నీటి పారుదలకు చర్యలు చేపట్టిందని, వీటిని నియంత్రించే దిశగా నేటి కూటమి ప్రభుత్వం వైఖరి ఉందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు శిష్యుడు గనుక, వాటి షరతులకు లొంగి సాగునీటి నిర్వహణ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేపడుతుందని, అందులో భాగంగానే సాగునీటి సంఘాల నియామకమని విమర్శించారు. మరోవైపు ప్రాజెక్టు నిర్వహణకు, మరమ్మతులకు, తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ ఏడాది బడ్జెట్లో మన్యం జిల్లాకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. పైగా దీనికి డబ్బు లేదని ప్రభుత్వం చెప్పడం సిగ్గుమాలిన చర్యని అన్నారు. రుషికొండలో మూడు వేల కోట్లతో నిర్మించిన ప్యాలెసును, అక్కడ ఉన్న భూములను కేవలం రూ.33కే నారా లోకేష్ బినామీ సంస్థలకు, టాటా వారికి అప్పగించడం, రాజధాని రైతుల నుంచి లక్షల కోట్ల భూములను ఊరకనే లాగేసుకొని బడా కార్పొరేట్ కంపెనీలకు అతి చౌక ధరకు కేటాయించమంటే ప్రభుత్వ సంపదను కూలగొట్టడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్ల సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసి, రైతుల పంట పొలాలకు నీరందించే ప్రాజెక్టులను విస్మరించడం ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ సంపాదనను ఉచితంగా కార్పొరేట్లకు అందిస్తేనే సంపద సృష్టించగలరా, రైతులకు నీరందిస్తే సంపద సృష్టించలేరా ఈ విషయం కూటమి అధినేత చంద్రబాబుకి తెలియలేదా అని అన్నారు. ఇకనైనా చంద్రబాబు కుట్ర పూరిత వైఖరిని విడనాడి ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన లస్కర్లను నియమించాలని, కాలువల్లో పేరుకుపోయిన జంగిల్ క్లియర్ చేయాలని, వాటికున్న సీల్డ్ తొలగించి రైతుల భూములకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో పిఒ తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందుగా నీలకంఠపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి, అక్కడి విద్యార్థులతో మమేకమయ్యారు. వంట, భోజనాలు, వసతి గృహ గదులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్యం, పరిశుభ్రత పరిస్థితులను గమనించి, అవసరమైన సూచనలు జారీ చేశారు. అనంతరం పిహెచ్‌సిని తనిఖీ చేసి ఔట్ పేషెంట్, డ్రగ్ రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడి రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి, అందిస్తున్న ఇతర సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన ఆరోగ్య సంరక్షణ అందించేలా చూడాలని వైద్యులను, సిబ్బందిని పిఒ ఆదేశించారు. పిఎం జన్ మాన్ పథకం కింద కోసంగిగూడలో బహుళార్ధ సాధక కేంద్ర నిర్మాణాన్ని తనిఖీ చేసి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలం దండుసురగూడలో ప్రధానమంత్రి జన్ మాన్ గృహాల పరిశీలించిన ఆయన అక్కడ లబ్ధిదారులతో ముచ్చటించారు. అన్ని గృహాలను సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో గిరిజన సంక్షేమం, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాల నివారణకు చర్యలు : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

సీజనల్ జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మలేరియా ప్రభావిత గ్రామాల్లో విస్తృతంగా నియంత్రణా చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని మాధ్యమాలను వినియోగించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణులకు కళాజాత, మొబైల్ వాహనం ద్వారా వీడియో ప్రదర్శన కార్యకమాలు ఎక్కువగా ఆకట్టుకుంటాయని, తద్వారా సులభంగా అవగాహన కల్పించవచ్చని అందుకు సంబంధించి ఆయా గ్రామాల వారీగా రోజువారీ కార్యక్రమ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మలేరియా మందుల కొరత ఎక్కడైనా ఉంటే తమ దృష్టి తీసుకురావాలన్నారు. ఫ్రైడే డ్రైడే, దోమల మందు పిచికారీ పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు టి. జగన్ మోహనరావు, రఘు కుమార్, కౌశిక్, కన్సల్టెంట్ రామచంద్ర తదితరులు ఉన్నారు.



చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

చెవిలో పువ్వుతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె సందర్భంగా మంగళవారం చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదురుగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ పాలకులు గతంలో హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదని, చర్చల పేరిట గత పది నెలల నుంచి కాలయాపం జరుగుతుందని విమర్శించారు. షరతుల్లేకుండా తల్లికి వందనంతో పాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, పెంపు కేటగిరి నిర్ణయ విషయంలో కూడా జరిగిన పొరపాట్లు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జీవోలు ఇవ్వాలని, సంబంధిత మంత్రి కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమ్మె విరమింపజేసి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎపి అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి జి.జెస్సీబాయి, బి.అమరవేణి, ఎం.శ్రీదేవి, ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కాదా రాము మద్దతు తెలిపారు. శిబిరంలో మానవహారంలో వై.హరిబాబు, పి.సతీష్, ఎస్.బాబురావు, పి.శ్రీనివాసరావు, ఐ.రాజు, కె.నర్సింగరావు, పి.సాయి, జి.నారాయణ, బి.సురేష్, సిహెచ్ రాము, అరవిందర్, సిహెచ్ సంజీవి తదితరులు పాల్గొన్నారు.

హీటెక్కిన కురుపాం రాజకీయం

◆ తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం

◆ ఆరోపణలు... ప్రత్యారోపణలు

ప్రజాశక్తి- కురుపాం

నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నేతలు వ్యక్తిగత ఆరోపణలకు సైతం దిగుతుండడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. నియోజకవర్గ కేంద్రంగా చోటు చేసుకుంటున్న రాజకీయ, అవినీతి సంఘటనలతో అధికారి పార్టీ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి, మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి మధ్య మాటకు మాట పెరుగుతోంది.

ఇటీవల కురుపాం నియోజకవర్గ వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో రాచరికకోట పాలన నుంచి విముక్తి లభించిన తరుణం అని పోస్టర్లు వేశారని మాట మాటికీ కోటా కోటా అనే వారికి ఈ వేదిక మీద నుంచి ఓ మాట చెప్తున్నా వినుకొండి మేరంగి కోట అంటే దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేసే శత్రుచర్ల కోట ఇది రాచరిక కోట కాదు, రాజనీతిని పాటించే కోట ఈ కోటను మట్టితోనో రాళ్లతోనో ఇసుకతోనో కట్టిన కోట కాదు. కురుపాం ప్రజల ప్రేమ, అభిమానం, ఆత్మీయతతో ప్రజలు కట్టుకున్న ప్రజాస్వామ్య కోట, కోటలో ఉన్నది రాజు, రాణి కాదు ప్రజల కోసం పనిచేసే పరీక్షిత్ రాజు, శ్రీవాణి అని ఇంకోసారి మీ మాట కోట మీద వాలిందో కోటలో ఉన్న కోటదుర్గమ్మ తల్లి ఉగ్రరూపం ఎలా ఉంటుందో కోటాను నమ్మిన ప్రజలే నీకు రుచి చూపిస్తారు అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చేసిన నాయకురాలిని నేను, అసమర్ధ నాయకురాలు నువ్వు, ఉద్యోగుల బదిలీలకు లంచాలు తీసుకునే నువ్వెక్కడ ఉద్యోగులకు అండగా నిలిచిన నేనెక్కడ, ఇంజినీరింగ్ కాలేజీ తెచ్చిన నేనెక్కడ, కనీసం ఓ స్కూల్‌ను కూడా తేలేని నువ్వెక్కడ, కార్యకర్తల కోసం ప్రాణమైనా ఇచ్చే నేనెక్కడ, నీ కార్యకర్తల దగ్గర కూడా కమీషన్లు తీసుకునే నువ్వెక్కడ, కురుపాం సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన నేనెక్కడ, కురుపాం గళమే వినిపించని గన్నేరు పప్పువి నువ్వెక్కడ, ఆడబిడ్డలు చనిపోతే కనీసం ఆసరా నిలవని నువ్వెక్కడా, ఆడబిడ్డలకు కష్టమొస్తే అరక్షణం కూడా ఆలస్యం చేయకుండా అండగా నిలిచే నేనెక్కడ, పుష్ప అంటే పేరు కాదు పుష్ప శ్రీవాణి అంటే నియోజకవర్గంలో ఒక బ్రాండ్ అని విమర్శలు చేశారు.





దీనికి స్పందించిన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో వారి పార్టీ కార్యక్రమాలు మరిచిపోయి పదే పదే నా పేరు తలుచుకుంటూ మాజీ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి సునకానందం పొందుతున్నారన్నారు. ఎందుకంటే కురుపాంలో గత పదేళ్లుగా లేనటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో ప్రజలకు అందించడం చూసి ఓర్వలేక బురద జల్లుతున్నారని, కోట దుర్గమ్మ తల్లి ఆగ్రహానికి గురవుతానని నా మీద నువ్వు అనడం సమంజసం కాదని అన్నారు. ఎంపిటిసిగా ఉన్న నాకు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు కోట దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ఉండడమే గెలిచానని, కోట దర్గమ్మ తల్లి ఆగ్రహానికి గురయింది నీవు కనుక నిన్ను ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని హితవు పలికారు. సొంత మామను, ఆడపడుచును బయటకు పంపేశావని, నువ్వు నా గురించి మాట్లాడేది ఏంటిని, మా తాత అడ్డాకుల లక్ష్మనాయుడు రెండుసార్లుగా ఎమ్మెల్యేగా గెలిచిన కుటుంబం నుంచి నేను వచ్చానని, ప్రతిరోజు ప్రజల మధ్య ఉంటూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తుంటే నా పరిపాలన చూసి ఓర్వలేక నోటికొచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదని చెప్పారు. నువ్వు గత పదేళ్లుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదు సరే కదా టిడిపి నాయకులపై కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేశావని, నువ్వు నీ కోట అభివృద్ధి చేశావు తప్ప నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, నా మీద వ్యక్తిగతంగా విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇలా ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. విమర్శ, ప్రతి విమర్శలతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కురుపాం నియోజకవర్గంలో మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక స్వామి థియేటర్ నుంచి వట్టిగెడ్డ వంతెన వరకు ప్రధాన రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రహదారి మధ్యలో అక్కడక్కడ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు డ్రిల్లింగ్ మిషన్‌తో తవ్వకాలు జరుపుతున్నారు.

మెగా సింగర్స్ ఫెస్ట్ ప్రపంచ రికార్డ్ పొగ్రామ్‌నకు దేవానంద్ ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



ఆగస్టు 9న ఏలూరులో జరగబోయే తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ కల్చరల్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సింగర్స్ ఫెస్ట్ వరల్డ్ రికార్డ్స్ పోగ్రాంకు గుమ్మలక్ష్మీపురానికి చెందిన గాయకుడు పాలక దేవానంద్‌ను యాంకర్‌గా, గాయకునిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఇటువంటి మెగా కార్యక్రమంలో తనను ఎంపిక చేయడం, పాడుతా, తీయగా విన్నర్లతో కలిసి పాడే పాటలు పాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మాస్టర్‌ను ఎంపిక చేయడం పట్ల గ్రామస్తులు, మిత్రులు మద్ది సుధాకర్, కింతలి వెంకటరావు, బంధువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఎఎంసి చైర్‌పర్సన్‌కు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొత్తగా ఎన్నికైన కద్రక కళావతిని లక్కగూడ గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ కళావతికి కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. సన్మాన కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.



గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేస్తున్న ఎంపిడిఒ

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలిలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి వద్దకు వెళ్లి బుట్ట బుట్ట ద్వారా చెత్త సేకరణ చేసి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి దాన్ని ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. అనంతరం మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ తెరేజమ్మ, క్రాస్ మిత్రులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి పద్మావతి

అన్ని పాఠశాలల్లో సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించాలని జిల్లా ఉప వైద్యాధికారి కెవిఎస్ పద్మావతి అన్నారు. మంగళవారం జియ్యమ్మవలస మండల కేంద్రంలోని పిహెచ్‌సిని, శిఖబడి, గెడ్డ తిరువాడ ప్రాథమిక ఉప ఆరోగ్యం కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను ల్యాబ్ గదిలను పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్, మలేరియా జ్వరాల వ్యాప్తి నివారణకు గర్భిణులకు రక్తహీనత లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు అన్ని పాఠశాలలో విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ జగదీష్ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మోడల్' విద్యార్థికి ట్రిపుల్ ఐటి సీటు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల విద్యార్థి బి.రవికుమార్‌కు ఐఐఐటి రెండవ విడత కౌన్సిలింగ్‌లో ఒంగోలు కళాశాలలో ప్రవేశం లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రవికుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.



బదిలీ పై వెళ్లిన వ్యక్తిని సన్మానిస్తున్న అధికారులు

సేవలందించే వారికి గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

సేవలందించే వారికి గుర్తింపు ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఎడిఎ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం సీతానగరం నుంచి పార్వతీపురం బదిలీపై వెళ్లిన సిహెచ్ దీనకుమార్ ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేసే ప్రతి ఉద్యోగి ప్రజలు మన్నలను పొందుతారని వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమం బలిజిపేట పశు వైద్యాధికారి జి.గణేష్ మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు, వైద్యాధికారులు చక్రధర్, సంతోష్ కుమార్‌తో పాటు గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావుపల్లిలో 'తొలి అడుగు'

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, సత్వరమే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధి, విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అక్కేన మధుసూదన్ రావు, నాయకులు ఎం.పురుషోత్తమ నాయుడు, అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం నుంచి ఉన్న అనుమతుల మేరకే ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు చేపట్టాలని వ్యవసాయ శాఖ విజిలెన్స్, ఇంటిలిజెన్స్ అధికారి పి.రమణయ్య అన్నారు. మండలంలోని మన గ్రోమోర్, స్టార్ క్రాఫ్ట్ ఆగ్రో కెమికల్స్ పరిశ్రమను మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని, గంగరేగువలసలో గల స్టార్ ఆగ్రో కెమికల్స్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ రెండు ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తున్న ఎరువులు, పురుగు మందుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ అనుమతులు ఏ మేరకు ఉన్నాయి ఆ మేరకు అమ్మకాలు జరుపుతున్నారా లేదా అన్న వివరాలు ఆరా తీశారు. అలాగే కంపెనీకి ప్రభుత్వం నుంచి ఉన్న అనుమతుల లైసెన్స్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు తయారు చేసిన మందులను శాంపుల్ తీసి నివేదికల కోసం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులకు లేకుండా పురుగులు మందులు, ఎరువులు అమ్మకాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు పురుగులు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే అమ్మాలని ఆదేశించారు. నిషేధించిన పురుగుల మందులు, ఎరువులను అమ్మకాలు చేస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రాజాం ఎడిఎ కె.చంద్రరావు, టెక్నికల్ అధికారి రవీంద్ర, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాద్, విఎఎ మాధురి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎరువులు దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కాలనీకి తాగునీరు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో మంచినీరు కరువైందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మికి వినతిని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ బాపూజీ కాలనీలో 16 కుటుంబాలున్నాయని, వీరంతా వికలాం గులు, వృద్ధ వికలాంగులేనని, గతంలో ప్రభు త్వం వీళ్లను చిత్తశుద్ధితో గుర్తించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రయత్నం చేపట్టిందని తెలిపారు. ఈ కాలనీలో నాలుగు కొళాయిలు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఒక్క కుళాయి ద్వారానే నీరు వస్తుందని, అది కూడా వారానికి ఒకసారి మాత్రమేనని తెలిపారు. అలాగే రెండు చేతి బోర్లు ఉన్నాయని, అవి కూడా పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయ న్నారు. కావున నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి బాపూజీ కాలనీ ప్రజలకు మంచినీరం దించేందు తగిన చర్యలు చేపట్టాలని, అలాగే బోర్లు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయ కులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, సురేష్, కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతినిస్తున్న నాయకులు

అశోక్ గజపతిరాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి సీనియర్ నాయకులు, గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విజయనగరం కోటలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కొంతసేపు ముచ్చటించారు. సీనియర్ నాయకులకు, నిజాయితీ నాయకులకు పార్టీలో గుర్తింపు ఉంటుం దని, దానికి నిదర్శనం అశోక్ గజపతి రాజు అని అన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర బి.సి సెల్ నాయకులు మరడన తవిటి నాయుడు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, మండల కన్వీనర్ జోగి భుజంగరావు, కొమరాడ మండల రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను, తదితరులు ఉన్నారు.



అశోక్‌ను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

డ్రమ్‌సీడర్‌తో ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

ప్రజాశక్తి - పాచిపెంట

సాంప్రదాయ పద్ధతిలో వరి నాటే కంటే డ్రమ్‌సీడర్ ద్వారా నేరుగా వారి నాటుకుంటే అధిక దిగుబడులు వస్తాయని, ఖర్చు గణనీయంగా తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో రైతు యాళ్ల ఈశ్వరరావు వేసిన డ్రం సీడర్ వరిని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో మొట్ట మొదటిసారిగా డ్రమ్ము సీడరు వరి విధానాన్ని రైతు ఈశ్వరరావు ఆచరించడం ఎంతో అభినందనీయమని రైతులు ఈ విధానాన్ని పాటిస్తే ఎంతో సమయంతో పాటుగా సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని దిగుబడులు కూడా 10 శాతం పెరుగుతాయని అన్నారు. ఈ విధానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్న డ్రమ్స్ సీడర్ వరి విధానాన్ని రైతులు అవలంభిస్తే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు నాగమణి, వినోద్, ఎఇఒ గణేష్ పాల్గొన్నారు.



డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు జల్లుతున్న రైతులు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం, గొట్టివలస గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎఒ టి. జ్యోత్స్నా మాట్లాడుతూ 13 రైతుసేవా కేంద్రాల్లో 194 మెట్రిక్ టన్నుల యూరియా, 133 మెట్రిక్ టన్నుల డిఎపి అందుబాటులో ఉందన్నారు. కౌలు రైతులు కౌలు కార్డ్స్ చేయించుకోవాలన్నారు. పంటల బీమా విధిగా రైతులు చెల్లించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ ఆర్.శ్రీనివాస్, కెవికె సైంటిస్ట్ సరస్వతి, ఎఇఒ ఎ.హరీష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

మంచి నాయకత్వంతో పాఠశాలను నడపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయులు మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని పాఠశాలను ఆదర్శవంతంగా నడపాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని మరిపివలస పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ వల్ల కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత పాఠశాలలో ఉపాధ్యాయులు మంచి నాయకులుగా పాఠశాలను నడుపుతూ తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసుకుంటూ పాఠశాలలను అభివృద్ధి చేయాలని అన్నారు. బడి ఈడు పిల్లలను అందరినీ బడిలో చేర్పించి, ఎన్రోల్మెంట్ పెంచుతూ విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధి జరిగేలా చూడాలని ఆయన సూచించారు. అనంతరం రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ఎపిసి టి.తేజేశ్వరరావు, నాబార్డ్ డిడిఒ డి.దినేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సోమవారం రాత్రి, మంగళవారం సాయంత్రం వరుణుడు కరుణించి వర్షం కురిపించడంతో నారుమడులు, ఎదలలో వర్షం నీరు చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడకపోతే పంటలపై ఆశలు వదులుకొని వలసబాట పట్టవలసిందేనని అన్నదాతలు ఆలోచిస్తు తరుణంలో కురిసన వర్షం వారికి ఊపిరి పోసింది. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు భగభగ మండే సూర్యుడు వేడినీ తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం పడటంతో కొంతమేర ఊరాట ఇచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడటం వల్ల మేజర్ పంచాయతీ పరిధిలోని పాత బస్టాండు, మర్రి తదితర వీధుల రహదారులు నీటితో నిండిపోయాయి. కాలువలు శిథిలావస్థ చేరుకోవడంతో మురుగునీరంతా రోడ్డుపై ప్రవహించడంతో అందులోనే పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



వరి నారు మడిలో చేరిన నీరు



ధ్రువపత్రాలను అందిస్తున్న తహశీల్దార్ శ్రీకన్య

ఎన్నికలపై బిఎల్‌ఒలకు శిక్షణ

ప్రజాశకి - సీతంపేట

ఎన్నికల నిర్వహణపై బిఎల్‌ఒలకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ డి.శ్రీకన్య అన్నారు. మంగళవారం స్థానిక వైటిసిలో ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14, 15, 16 తేదీల్లో మూడు రోజుల పాటు 105 మంది బిఎల్‌ఒలకు ఎన్నికల ఫార్మట్‌పై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలక్షన్ ఫామ్స్ ఆన్లైన్లో పరీక్ష ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు శిక్షణలో భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అవగాహన సామర్థ్యం పెంచుకోవడానికి శిక్షణ ఎంతో అవసరమని చెప్పారు. పేర్లలో మార్పులు, మరణాలకు సంబంధించిన ఓటర్ల తొలగింపు, ఇంటింటి సర్వే తదితరులు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫారం-6,7లపై బిఎల్‌ఒలకు అవగాహన కల్పించారు. 6ఎ గురించి వివరించారు. కొత్త ఓటర్లు యాడింగ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ విజయ గణేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై ఫిర్యాదు


ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పైన ఫేస్‌బుక్, సోషల్ మీడియా వేదికగా తురకనాయుడువలస గ్రామానికి చెందిన వైసిపి మహిళ కార్యకర్త ఇత్తిలి మణి, ఏ మణిమ్మ చేసిన అసత్య ఆరోపణలు, ఆ వాస్తవాలను కండిస్తూ కేతిరెడ్డి అశోక్ కుమార్, ఇతర నాయకులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్, సోషల్ మీడియా ఆధారంగా మణి ఫేస్బుక్ ఐడి ద్వారా పబ్లిసిటీ చేయడం మణి ఫేస్బుక్ ఫ్రెండ్‌గా ఉన్న కేతిరెడ్డి అశోక్ కుమార్ ఆ అనుచిత వ్యాఖ్యలు, ఆ వాస్తవాలను పోస్టర్ రూపంలో ఫేస్‌బుక్‌లో ప్రచురించడం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై పోలీస్ స్టేషన్‌లో ఆ మహిళా కార్యకర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని అశోక్‌కుమార్ తెలిపారు. మండల నాయకులతో పాటుగా వట్టిగెడ్డ రిజర్వాయర్ చైర్మన్ ఎం.సత్యం నాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ గార గౌరీ శంకర్రావు, కొమరాడ జనసేన మండల పార్టీ అధ్యక్షులు తెంటు శ్రీకర్, మండల అధ్యక్షులు బోను శివ, నాయకులు పత్తిగుల్ల ధర్మ పాల్గొన్నారు.

డ్రైవర్ల డిమాండ్లపై చర్చలు వాయిదా

ప్రజాశక్తి- పార్వతీపురం

ఆర్‌టిసి అద్దె బస్ డ్రైవర్ల డిమాండ్లపై యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు, బస్సు యజమానుల మధ్య లేబర్ కమిషనర్ సువర్ణ సమక్షంలో మంగళవారం ఉదయం జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. యజమానుల తరుపున రవీంద్ర రెడ్డి, మరో ఇద్దరు హాజరయ్యారు. అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్, సిఐటియు తరుపున సిఐటియు జిల్లా కార్యదర్శి బి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, యూనియన్ ట్రెజరర్ ఎస్.మన్మధరావు, రాంబాబు పాల్గొన్నారు. నష్టాలు వస్తున్నందున ఆయిల్ ఎక్కువ అవుతున్నందున 500రూపాయలు పెంచుతామని, కొన్ని బస్సులకు వెయ్యి రూపాయలు ఇస్తున్నామని యజమానులు చెప్పారు. అది చాలదని యూనియన్ నాయకులు చెప్పడంతో చర్చలు వాయిదా వేశారు. యజమానులందరితో మాట్లాడి మళ్లీ చర్చలకు వస్తామని యజమానులు చెప్పారు. యూనియన్ నాయకులు చర్చించుకుని ఓనర్లతో మాట్లాడుకుని మళ్లీ ఈ నెల 18 మధ్యాహ్నం 3 గంటలకు చర్చలకు రావాలని లేబర్ కమిషనర్ సువర్ణ చెప్పడంతో అందరూ అంగీకరించారు. ఆ రోజుకు ఓనర్లు ఒప్పందానికి రాకపోతే సమ్మె ఆందోళన పోరాటం ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.



చర్చల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, యాజమాన్య ప్రతినిధులు

'మధ్యవర్తిత్వం- దేశం కోసం' పై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మంగళవారం మధ్యవర్తిత్వం దేశం కోసంపై మంగళవారం అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సభ్యులు గొటారి వెంకటరావు, పారా లీగల్ వలంటీర్ అందవరపు కోటేశ్వరరావు, మండల న్యాయసేవ సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్ కక్షి దారులకు మధ్యవర్తిత్వం, రాజీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కక్షి దారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లోక్ అదాలత్ సభ్యులు